
ఆంధ్రజ్యోతి



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6, కనిష్ఠం 19.5

కామారెడ్డి జిల్లా వార్తలు

5

మంగళవారం 11 ఫిబ్రవరి 2025


రాష్ట్రస్థాయి పోటీలకు పలువురి ఎంపిక

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి యూత్ అండ్ ట్రాయాత్లాన్ ఎంపికలు ఉత్తమప్రతిభ కనబరిచి పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికైన వారిలో హరివర్ధన్, జీవన్, సుమలత, భవాని, గంగోత్రి, రాము, సంజూ, లక్ష్మన్, రిమ్‌షాబేగం, ప్రియాంక, నితిన్, విజయ్‌సింగ్, ప్రశాంత్, వంశీకృష్ణ, కార్తీక్, రాహుల్, మౌనిక, సంధ్య, శ్రావ్య, స్పందన, రోహణ్, ఈశ్వర్, అనిల్‌కుమార్, దివ్యఈశ్వర్ ఉన్నారు.

- 'స్థానిక'ంలో గెలువడమే లక్ష్యంగా పార్టీల ప్రణాళిక
- కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేస్తున్న కాంగ్రెస్
- పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు
- సత్తాచాటేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్
- బీసీ రిజర్వేషన్‌లపై చలో కామారెడ్డి
- పట్టుసాధించేందుకు బీజేపీ యత్నం
- ప్రజలకు కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ

'స్థానిక' ఎన్నికలపై పార్టీల గురి!





కామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల సమరానికి రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు గురిపెట్టాయి. ప్రధానంగా గ్రామస్థాయి నేతలు రెట్టింపు ఉత్సహంతో పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయితే తాము ఎక్కడినుంచి పోటీ చేయాలో తెల్చుకునేందుకు కొందరు నేతలు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీల గుర్తుపై, గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీల మద్దతుతో స్వతంత్ర గుర్తులపై జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న రాజకీయ పార్టీలు వ్యూహం రచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ బీసీ రిజర్వేషన్లపై ఉద్యమించేందుకు సిద్ధమవుతోంది. చలో కామారెడ్డి బహిరంగ సభతో స్థానిక సంస్థల ఎన్నిక లకు పోవాలని నిర్ణయించింది. బీజేపీ చాపకింద నీరులా ఎన్నికలకు సిద్ధమవుతోంది. క్షేత్రస్థాయిలో బలం పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ ఎన్నికలపై దృష్టిసారించింది.

ప్రభుత్వ పథకాలతో ప్రజల్లోకి కాంగ్రెస్

అధికార కాంగ్రెస్ పార్టీ అందరికంటే ముందే స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి దోహదం చేసిన జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అధిక్యత ప్రదర్శించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేలు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో మండల, గ్రామస్థాయి నాయకులతో ఎన్నికల్లో పనిచేయడం సమస్య కాదని భావిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు ఎన్నికల్లో పోటీకి సై అంటున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామ పంచాయతీ ఇలా ఏదో ఒక ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గ్రామస్థాయిలో పార్టీలో విబేధాలు తలెత్తకుండా జిల్లా నాయకత్వం సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నారు. గెలిచే అభ్యర్థులనే బరిలో దింపాలని నేతలు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులు స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయా నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

సత్తాచాటేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్

గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీలలోనూ బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పాటు జిల్లాలో కూడా ఆ పార్టీకి కొలుకోలేని దెబ్బతగిలింది. జిల్లాలో ఒక సీటు గెలుచుకున్నప్పటికీ ఆ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్‌లో చేరారు. గత ఎన్నికల వరకు జిల్లాలో బలమైన పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ఈసారి కొంత ఎదురీదుతోంది. ఈ ఎన్నికల్లో పుంజుకోవాలనే ఉద్దేశంతో పార్టీ నాయకత్వం ఉంది. ఇందులో భాగంగా బీసీ రిజర్వేషన్ల కోసం చలో కామారెడ్డి కార్యక్రమాన్ని తలపెట్టాలని ఆపార్టీ నిర్ణయించింది. అన్ని నియోజకవర్గాల్లో బీసీ రిజర్వేషన్‌లపై చలో కామారెడ్డి కార్యక్రమంపై కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కామారెడ్డి నుంచే బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఆ వర్గం ఓట్లను తమవైపు తిప్పుకుందని అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లు ప్రకటించక మోసం చేసిందని ఇదే అంశంపై ప్రజల వద్దకు వెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అదేవిధంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు ప్రయత్నాలు ప్రారంబిస్తున్నారు. మరోవైపు మాజీఎమ్మెల్యేలు స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీశ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పట్టుసాధించేందుకు బీజేపీ

గత అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో పలు సీట్లను సాధించి ఉత్సహంతో ఉన్న బీజేపీ స్థానిక సంస్థలలోనూ పట్టు సాధించాలని ఆపార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఈఎన్నికల్లో తమ ఉనికిని చాటుకునేందుకు బీజేపీ ఆరాటపడుతోంది. ఇప్పటికే జిల్లాలో బీజేపీ నుంచి (తరువాయి 8వ పేజీలో..)



ఖిల్లా రామాలయాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- సీతారాముల కల్యాణ వేడుకల్లో పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

7లో

విద్యార్థులకు వరంగా మోడల్ పాఠశాలలు





దామరంచ శివారులో రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వరి పంటలను ఎండిపోనివ్వం

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమలరెడ్డి

బీర్కూర్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): వరి పంటలు ఎండకుండా సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన అధికారులు, స్థానిక రైతులతో కలిసి దామరంచ, రైతునగర్, కొల్లూరు శివారుల లో గల వరి పంటలను పరిశీలించారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా సాగు నీరు సరఫరా అవుతున్నా 25వ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా సాగునీరు అందక దామరాంచ, రైతునగర్, కొల్లూర్ గ్రామాల శివార్లలో వరి పంటలు ఎండిపోతున్నాయి. ఈ మేరకు రైతులు తన పంట పొలాలకు సాగునీరును అందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. పంటలు ఎండిపోతున్నాయని పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్పందించి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారితో పాటు ఏడీఏ అరుణ, ఎంఏవో కార్తీక్, ఏఈవోలు ఉన్నారు.

ఎండిన పంటల పరిశీలన

నసురుల్లాబాద్: మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో ఎండిపోయి వరి పంట పొలాలను సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ రైతులు, అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వరి పంటలు ఎండిన రైతులు అధైర్య పడవద్దని, సాగునీరు అందక చెరువు కింద ఎండిపోయిన పొలాలకు నీళ్లు అందించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏడీఏ అరుణ, ఏవో భవాని, ఏఈవోలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డుమెంబర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పలు అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట స్టేజీలో సోమవారం, మంగళవారం కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ల పరిధిలో రిటర్నింగ్ అధికారులకు కలెక్టరేట్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. రెండో స్టేజీలో 12 న డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమం, 14 న మండలస్థాయిలో ప్రిసైడింగ్ అధికారుల/పోలింగ్ అధికారుల నియామకం గురించి మొదటి ర్యాండమైజేషన్ చేసి వారికి ఎన్నికల డ్యూటిని కేటాయించడంపై పలు సూచనలు చేశారు. బ్యాలెట్ బాక్సులు ఓటర్ల సంఖ్యకు తగు విధంగా చిన్న, మధ్యస్థ, పెద్ద మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పెద్దకొడప్‌గల్ మండలం బాబుల్‌గావ్ గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురణకోసం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. 11న మండల స్థాయి రాజకీయా పార్టీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు, పోలింగ్ స్టేషన్లపై ఉన్న అభ్యంతరాలపై ఏవిధంగా స్పందించాలనే దానిపై వివరించారు. 12న అభ్యంతరాలు తెలుపాలని 13 న చివరిజాబితా ప్రకటించి 14 న అందరికి సవివరంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీపీఓ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య

కుల వివక్ష రూపు మాపాలి

- గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి
- వివక్ష చూపిన వారిని 24 గంటల్లో కోర్టుకు హాజరుపర్చాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య

తాడ్వాయి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంటరానితనం, కుల వివక్షను రూపుమాపాలని, ఆ బాధ్యత అధికారులదేనని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని బ్రాహ్మాజీవాడి గ్రామంలో కుల వివక్షకు గురైన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం మల్లికార్జున స్వామి విగ్రహావిష్కణ, భజన కార్యక్రమం దళితులను దూరంగా కూర్చోవాలనే అంశం తమ దృష్టికి వచ్చిందని, దళితుల పట్ల కులవివక్ష చూపినవారిని 24 గంటల్లో అరెస్టుచేసి కోర్టు ఎదుట హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించారు. బ్రాహ్మాజీవాడి ఘటన మళ్లీ పురావృతం కాకుండా అధికారులే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కులవివక్ష ఉన్న గ్రామాల్లో ఎక్కడా అవగాహన సదస్సులు, చర్యలు చేపట్టడం లేదని ఎస్సీ ఎస్టీ సభ్యులు కమిషన్




మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100
- ఉపాధ్యాయుల స్థానానికి 18
- నేడు పరిశీలన
- 13న ఉపసంహరణ

కరీంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగిసింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లను స్వీకరించారు. పట్టభద్రుల స్థానానికి 100, ఉపాధ్యాయ స్థానానికి 18 నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా 27న పోలింగ్ నిర్వహించనున్నారు. అయితే వరుసగా రెండో శనివారం, ఆదివారం సెలవుదినాలు రావడంతో సోమవారం ఎక్కువ మంది నామినేషన్లు వేస్తారని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం భారీగా బందోబస్తు చేసింది.

ఎల్లారెడ్డి ప్రజలకు అందనున్న అమృత్ 2.0



- ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి రూ.35 కోట్ల నిధులు
- ఇప్పటికే పూర్తయిన టెండర్ ప్రక్రియ
- ఏడాది లోపు పూర్తి కానున్న పనులు
- ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో తాగునీటికి ఇక శాశ్వత పరిష్కారం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలుచేస్తున్న అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రెజువెనేషన్ అండ్ అర్బర్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకంతో ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. మరో 20 ఏళ్ల వరకు రోజువారి అవసరం మేర నీరు సరఫరా చేసే అవకాశం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి కాగా త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిసింది.

మిషన్ భగీరథ పథకం అమలు చేస్తున్నప్పటికీ ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలో పైప్‌లైన్ వేయకపోవడంతో నల్లాల ద్వారా తాగునీరు అందడం లేదు. పట్టణంలో మిషన్ భగీరథ పథకం కింద సుమారు 21 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న 19 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. కాగా పట్టణ జనాభా సుమారు 24 వేల జనాభా ఉంటుంది. ఒకరికి రోజుకు 135 లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్యాంకుల కెపాసిటీ అంతమేరా లేకపోవడంతో పలు ట్యాంకుల నుంచి డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అయితే పైప్ లైన్ ఉన్న పలు ప్రాంతాల ప్రజలకు సరిపడా నీరు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక పట్టణంలోని పలు ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు తగినంత సరఫరా జరగడం లేదు. దీంతో ప్రజలు సొంత బోర్లపైనే ఆధారపడి అవసరాలు తీర్చుకుంటున్నారు.

మరో 20 ఏళ్ల వరకు సమస్య లేకుండా..

ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకం కింద ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి రూ.34 కోట్లు మంజూరయ్యాయి. పట్టణంలో రాబోయే 20 ఏళ్ల వరకు నీటి సమస్య తలెత్తకుండా పథకం రూపొందించంతో పాటు ప్రజలకు రోజువారి అవసరం మేరకు నీటి సరఫరా చేసే లక్ష్యంతో పథకం అమలు చేయనున్నారు. అమృత్ పథకం కింద వచ్చిన నిధులతో 11వ వార్డులోని బీడీ కాలనీ ప్రాంతంలో ఐదు లక్షల లీటర్ల కెపాసిటీ నీటి ట్యాంకుతో పాటు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో 9లక్షల లీటర్ల కెపాసిటీ గల ట్యాంకు, ఆరవ వార్డు ఇంద్రనగర్‌లో రెండు లీటర్ల కెపాసిటీ ట్యాంక్, గండి మాసానిపేట్ సూర్య విహార్ ప్రాంతంలో 8లక్షలు లీటర్ల సామర్థ్యం గల మొత్తం నాలుగు వాటర్ ట్యాంకులు నిర్మించనున్నారు. కాగా అమృత్‌జల్ సరఫరాకు పైప్‌లైన్‌లు వేసి నల్లాలు బిగించి ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు. కాగా అమృత్ జల పథకం పనులు ఇప్పటికే టెండర్ దశ పూర్తయి అగ్రిమెంట్ స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. అగ్రిమెంట్ ఆయన ఏడాది లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

త్వరలోనే పనులు

అమృత్ 2.0 పథకం కింద ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి వచ్చిన నిధులతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

తాగునీటికి శాశ్వత పరిష్కారం

- మహేష్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి



అమృత్ పథకంతో ఎల్లారెడ్డి పట్టణ ప్రజలకు రాబోయే 20 ఏళ్ల వరకు నీటిని అవసరం మేరకు సరఫరా చేసే విధంగా పథకం రూపొందించారు. పథకం వినియోగంలోకి వస్తే పట్టణంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నీటి సరఫరా అవుతుంది. నీటి సమస్య లేకుండా పోతుంది.

బోధన్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



బోధన్‌లో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని సరస్వతినగర్‌లో విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వబ్రహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విశ్వకర్మ భగవానుడిని ఆశీర్వాదలు తీసుకున్నారు. అనంతరం యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ చారి, సంఘ వ్యవస్థాపకులు రాందాస్‌చారి, శివాలయం చైర్మన్‌హరికాంత్ చారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం కార్యదర్శి సుధాకర్ చారి, కోశాధికారి అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కితీసుకోవాలని నిరసన



వేల్పూర్‌లో నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సంఘ సభ్యులు

వేల్పూర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని వేల్పూర్ మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఉన్నత విద్యరంగానికి నష్టం కలిగించేలా యుజీసీ రూపొందించిన ముసాయిదాను తక్షణమే వెనక్కి తీసుకోవాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు జె.ప్రభాకర్ కోరారు. విశ్వవిద్యాలయాల్లో కార్యాకలాపాల్లో గవర్నర్‌కు ప్రాధాన్యం కల్పించడం, భారత రాజ్యంగం స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రపంచాన్ని నడిపించేది విద్య ఒక్కటే అనే విషయాన్ని ప్రతీఒక్కరు గుర్తుంచుకోవాలని, అలాంటి విద్య వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడే నిధులు కేటాయించడం లేదన్నారు.ఈకార్యక్రమంలో అంబేద్కర్ మండల ప్రధానకార్యదర్శి జంబావా చామర్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ పాల్‌రాజ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో ప్రవేశాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధి లోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు రెండవ దఫా అవకాశం కల్పించడం జరిగిందని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఓయూసీడీఈ.నెట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇతర వివరాలకు అధ్యయన కేంద్ర సమన్వయకర్త రాము 9912670252 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమురయ్యను గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని తెలిపారు. పట్టణంలో ఉన్న పట్టభద్రులు, టీచర్‌లను కలిసి బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసేలా అభ్యర్థించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు విపుల్‌జైన్, నరేందర్ రెడ్డి,లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరు: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి బీజేపీ ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ జిల్లా నాయకులు నరేందర్, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలకేంద్రంలోని రెడ్డిఫంక్షన్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఓటరు వద్దకు తప్పకుండా వెళ్లి బీజేపీ ఓటు వేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నాళేశ్వర్‌లో భక్తులకు ప్రవచనాలు అందజేస్తున్న మంగిరాములు మహరాజ్

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన సహిత దత్తాత్రేయ, పోచమ్మ దేవి ఆలయాల శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల పూజ, యంత్ర, మూర్తి ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహపూజ, బలి, మహ పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిపేట ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రవచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రెంజల్: పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్ద పోచమ్మ, చిన్న పోచమ్మ విగ్రహాలతో పాటు నవగ్రహలను వేద పండితుల సమక్షంలో ప్రతిష్ఠించారు. గ్రామ పొలిమేర నుండి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్దకు తీసుకువచ్చి నూతన విగ్రహాలను ప్రతిష్ఠాపన నిర్వహించారు. గ్రామంలో అందరు సుఖశాంతులతో ఉండేందుకు హనుమాన్ మందిరంలో నవగ్రహలతో పాటు పెద్ద పోచమ్మ, చిన్న పోచమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించడం జరిగిందని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కమటం గంగారాం, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నందకుమార్ తెలిపారు. నవగ్రహలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి గ్రామస్థుల ఆధ్వర్యంలో 14గంటలు యజ్ఞంలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మంగళ హారతులతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షులు నితిన్, బీజేపీ మండల అధ్యక్షులు గోపికృష్ణ, మాజీ ఉప సర్పంచ్ లత సాయిలు, సొసైటీ డైరెక్టర్ బుడ్డోళ్ల సాయిలు, అబ్బగోని గంగాధర్ గౌడ్, ప్రేమ్‌కుమార్, అనిల్, బాలకృష్ణ, సంతోష్, సాయిలు, గంగాదర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే కాంగ్రెస్ ధ్యేయం



గ్రామాలలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని బర్దీపూర్, పెంటాకలాన్, పెగడాపల్లి, మావందికలాన్, మావందిఖుర్దు, తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకులకే పట్టం కట్టాలన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను, ప్రజల ఇబ్బందులను తెలుసుకునేందుకే తాము గ్రామాల పర్యటన చేపట్టామని అన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వం పదేళ్లకాలంగా గ్రామాలను అభివృద్ధి చేయడంలో విఫలమైందని అందుకే ప్రజలు ఆ పార్టీని ఫాంహౌస్‌కు పరిమితం చేశారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, నాయకులు దాము, సంజీవ రెడ్డి, అల్లె రమేష్, సుదర్శన్, తాళ్ల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి సమాన హక్కులు ఉన్నాయి

● ఐసీడీఎస్ సీడీపీవో జానకి



విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

సాలూర,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలు మగ పిల్లలతో సమానమని ఇద్దరికి సమాన హక్కులు ఉన్నాయని బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో జానకి అన్నారు. సోమవారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బేటి బచావో, బేటి పడావో పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అవగాహన కల్పించారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని టీమ్‌ను ఉద్దేశించి ఐదు ఉద్దేశాలను తెలుపుతూ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లల యొక్క లింగ నిష్పత్తిని తగ్గించడాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. శిశు భ్రూణ హత్యల గురించి వివరించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు పెళ్లిళ్ల చేయడం వల్ల భ్రూణహత్యలకు పాల్పడడం, ఆడపిల్లలు, పసి పిల్లల మరణాలు ఎక్కువై అవుతుందని అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లిళ్ల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి,హెచ్‌ఎం మంజూష, అంగన్‌వాడీ టీచర్లు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సైంటిస్ట్ కావాలంటే విద్యార్థి దశ నుంచే

ఆలోచన విధానంలో మార్పు రావాలి



నందిపేటలోని రాకెట్లను పరిశీలిస్తున్న ఎంఈవో గంగాధర్

నందిపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సైంటిస్టులు(శాస్త్రవేత్తలు) కావా లంటే విద్యార్థి దశ నుంచే ఆలోచన విధానంలో మార్పులు రావాలని మండల విద్యాధికారి అవదూత గంగాధర్ తెలిపారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా కలాం ఇన్సిస్ట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెంట్ సహకారంతో డీఆర్‌డీవో, ఇస్రోలలో తయారైన మిసైల్స్, సాటిలైట్స్, మాంగల్యాన్, ఆర్యభట్ట, బ్రహ్మోస్, చంద్రయాన్‌తో పాటు 20 మోడల్స్‌లను పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా, డీఆర్‌డిఓ, ఇస్రో సెంటర్లను సందర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 1600 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజూరి అరుణ్, ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి రమేష్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



రుద్రూర్‌లో చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ చౌక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆరుగురు లబ్దిదారులకు సీఎం రిలీఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడప సాయిలు, పత్తి రాము, పత్తి లక్ష్మణ్, తోట సంగయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నవీపేటలో పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించిన దృశ్యం



నాళేశ్వర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం



నవీపేట నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ పిట్ల కృష్ణ మహరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● నవీపేటలో లక్ష్మినరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు, ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● బాగేపల్లిలో రామాలయ మొదటి వార్షికోత్సవం

రెంజల్: మండలంలోని బాగేపల్లి గ్రామంలో అభిష్ట రామాలయం మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రామాలయాన్ని ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కావడంతో మూడు రోజులు పూజ కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం చేపట్టారు. గ్రామంలోని మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు సాయాగౌడ్, గోపాల్, మాజీ సర్పంచ్ గాండ్ల సాయిలు, ఆగంటి సాయిబాబా గౌడ్, సురేందర్ గౌడ్, గోపి, సాయిలు, రంజిత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కేంద్ర మంత్రి, సీఎం దిష్టిబొమ్మల దహనం



భీమ్‌గల్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలల సంఘ నాయకులు

భీమ్‌గల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ మంత్రి మండలి ఆమోదం తెలపడంను అసెంబ్లీ శమిమ్ అక్తర్ కమిటీ నివేదికను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ భీమ్‌గల్ మండలంలోని మాల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల మాల సంఘం అధ్యక్షుడు బీమ్ రవీందర్, బట్టు అనిల్‌లు మాట్లాడుతూ గతంలో ఆరు శాతం మాలకు రిజర్వేషన్ ఉంటే ఇప్పుడు దానిని ఐదు శాతానికి తగ్గించడం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, మాలల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ రాబోయే ఎమ్మెల్సీ ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసి కాంగ్రెస్ ఓటమి కోసం మాలలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండె కాంతయ్య, కునే రమేస్, బద్దం అనిల్, కార్తిక్, చిత్తారి ఆనంద్, బట్టు సునీల్, గొట్టి పృథ్వీ, గోలి నరేష్, రాజారాం, సృజన్, రాహుల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండాతో కుంభమేళా

తరలివెళ్లిన యంచ గ్రామస్థులు



ప్రయాగ్‌రాజ్‌లో యంచ గ్రామస్థులు

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచకు చెందిన పలువురు గ్రామస్థులు ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు తరలివెళ్లారు. రెండు ప్రత్యేక బస్సులలో సుమారు 40మంది కుంభమేళాలో పుణ్యస్నానాలు చేయడానికి తరలివెళ్లారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు పలువురు యంచ గ్రామస్థులు బీఆర్‌ఎస్ జెండా పట్టుకుని గంగానది వద్దకు వెళ్లారు. అనంతరం త్రివేణి సంగమంలో వారు పుణ్యస్నానాలు ఆచరించి బీఆర్‌ఎస్ జెండాపై సైతం గంగా జలం చల్లారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని పుణ్యక్షేత్రంలో మొక్కుకున్నట్లు పలువురు యంచ గ్రామస్థులు పేర్కొన్నారు.

తడిపొడి చెత్తపై విద్యార్థుల ర్యాలీ



తడిపొడి చెత్తపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు తడిపొడి చెత్తపై ర్యాలీ నిర్వహించారు. తడిపొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను విభజించి మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని విద్యార్థులు ప్రజలకు సూచించారు. అలాగే ప్లాస్టిక్‌పై జరిగిన అనార్థాలను వీదికుక్కలతో ఉండాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టార్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, వార్డు ఆఫీసర్ అవినాష్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థి మృతి

● పుట్టిన రోజు నాడే మృతి చెందడంతో కుటుంబంలో విషాదం

నవీపేటఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(బి)కి చెందిన కళ్లెం అభిషేక్(17)అనే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఎస్‌ఐ వినయ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్(బి)కి చెందిన కళ్లెం అభిషేక్‌కు చదువుపై అంతగా ఇష్టం లేదు. గత సంవత్సరం ఆర్మూర్‌లోని ఎస్సీ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీలో చదవగా ఎక్కువ సబ్జెక్టులలో ఫెలయ్యాడు. అయినప్పటికీ తండ్రి బలవంతంగా ఈ సంవత్సరం మండల కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ కోర్సులో చేర్పించాడు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని తరుచుగా తోటి వారితో చెప్పుకునే వాడు. అభిషేక్ గత నెల 27న తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు సేవించగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు అభిషేక్ అంత్యక్రియలను సోమవారం అతడి స్వగ్రామామైన అబ్బాపూర్(బి)లో నిర్వహించారు. ఈ అంత్యక్రియలలో మండల కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన పలువురు తోటి విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. అభిషేక్ పుట్టిన రోజు నాడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులను కలిచివేసింది. తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అభిషేక్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గేదె మృతి



బస్సు ఢీకొని మృతి చెందిన గేదె

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి చెందింది. సోమవారం ఆర్మూర్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెర్కిట్ సమీపంలో రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

విద్యార్థుల పాలిట వరం.. మోడల్ పాఠశాలలు



మేనూర్ మోడల్ పాఠశాల

మద్నూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మోడల్ పాఠశాలలు గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాలిట వరంగా మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల వసతులతో నాణ్యమైన విద్యా బోధన అందిస్తుండటంతో ఏటా మోడల్ పాఠశాలలో చేరే విద్యార్థులు సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. విద్యా సంవత్సరానికి ఆరు నుంచి పదవ తరగతి సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మెరుగైన వసతులతో పాటు పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన అంది స్తుండటం, ఫీజుల భారం తగ్గుతుండటంతో ఈ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

● జిల్లాలో ఆరు మోడల్ పాఠశాలలు

కామారెడ్డి జిల్లాలో ఆరు మోడల్ పాఠశాలలు ఉన్నాయి. మద్నూర్ మండలం మేనూర్, నిజాంసాగర్ మండలం అచ్చంపేట, బాన్సువాడ మండలం, ఎల్లారెడ్డి మండలం, అలాగే గోపాల్‌పేట్ మండలం సదాశివనగర్ మండలాల్లో స్కూళ్ళు విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరవ తరగతిలో 100 సీట్ల చొప్పున జిల్లాలో 600 సీట్లను భర్తీ చేయనున్నారు. 7వ పదవ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు.

● 28 వరకు దరఖాస్తుల ఆహ్వానం

● అన్ని వసతులతో మోడల్ పాఠశాలలు

మోడల్ పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన ఉంటుంది. గ్రంథాలయాలు, ఆధునాత వ్యాధులు, డిజిటల్ తరగతులు, తరగతి గదులు, ఆట స్థలం, ఉచిత భోజన హాస్టల్ వసతులు ఉన్నాయి. పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వడం, 5వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్, ఐఐటీ కోచింగ్ ఇస్తున్నారు.

● పరీక్ష సిలబస్ విధానం

6వ తరగతి ప్రవేశ పరీక్షకు 5వ తరగతి సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. తెలుగు 25 మార్కులు, ఇంగ్లీష్ 25 మార్కులు ఉంటాయి. ఈవీఎస్ 25, గణితం 25 మార్కులు ఉంటాయి. ఏడో తరగతి నుంచి పదో తరగతి ప్రవేశ పరీక్షలో అంతకంటే వెనుక తరగతి సిలబస్ సంబంధించిన ఇంగ్లీష్ 25 మార్కులు, గణితం 25 మార్కులు, జనరల్ సైన్స్ 25 మార్కులు, సోషల్ స్టడీస్ 25 మార్కులు ఉంటాయి.

● తుది గడువు

ఈ నెల 28 వరకు

ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు దర ఖాస్తుల స్వీకరణ ఈ నెల 28తో ముగియనుంది. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఓపెన్ కేట గిరికి చెందిన విద్యార్థులు రూ.200 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు రూ.125 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏడవ తరగతి నుంచి పదో తరగతి ప్రవేశాల కోసం పరీక్ష రాసే విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.



మేనూర్ మోడల్ పాఠశాలను జనవరిలో సందర్శించిన ప్యానల్ టీమ్ సభ్యులు (ఫైల్)



ముస్తాబైన ఆలయం

వైభవంగా బంగారు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ముప్కాల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో శ్రీబంగారు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని రంగులతో, వివిధ రంగుల పువ్వులతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పూజారి రామకృష్ణ రామానుజాచారి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉమ్మడి బాల్కొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బంగారు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా ఐదు రోజుల పాటు జరుగతాయి. ఈనెల 9న అంకురారోహణం, దేవతాహ్వానం, ధ్వజా రోహణ, అగ్రిప్రతిష్ఠ, సాయంత్రం నిత్య హవనం, బలిహరణం, 10న మండప రాధ న, శతకాల అభిషేకం, సాయంత్రం నిత్యహవనం, బలిహరణం, తర్థీప్రసాత విత రణ, 11న నిత్యహవన బలిహరణం, సాయంత్రం రథ హోమం, రథప్రతిస్ఠ, రథో త్సవం, 12న ఉదయం ముత్యాల తలంబ్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత తీరు క ల్యాణ మహోత్సవం జరగనుంది. 13న నిత్యహవనం, మహాపూర్ణహుతి, చక్ర స్నా నం, మహా అన్నదానం, సాయంత్రం నాగవెళ్ళి, ఏకాంత సేవా వంటి కార్యక్రమా లు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నబ్రహ్మంగారి దేవాలయం

రేపు కమ్మర్‌పల్లిలో వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

● 13 న పోలేరమ్మ జాతర

● భక్తుల సౌకర్యార్థం వీడీసీ ఆధ్వర్యంలో వసతుల ఏర్పాటు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం, జాతర బుధవారం జరుగుతుందని వీడీసీ బోగ రామస్వామి, కోశాధికారి బుచ్చిమల్లయ్య, కొత్తపల్లి గణేష్, తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజు గుట్టపై యజ్ఞ కార్యక్రమాలు జరుగుతున్నాయని సోమవారం ఉదయం జరిగిన ప్రత్యేక పూజలు స్వామివారి యజ్ఞ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు గ్రామస్థులు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు దంపతులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం గుట్టపైగల స్వామివారి ఆలయంలో బ్రహ్మంగారు, గోవిందమ్మల కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు, మహాయజ్ఞం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, స్వామివారి కల్యాణం, జాతర ఉత్సవాల సందర్భంగా గుట్టపై భక్తుల సౌకర్యార్థం తాగునీటి, నీడ తదితర అన్ని వసతులను కల్పించినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారి కల్యాణం, సాయం త్రం గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి గుట్ట వరకు స్వామివారి రథోత్సవ ఊరేగింపు ఉంటుందని భక్తులు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కల్యాణం, జాతర, రథోత్సవం, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వీడీసీ సభ్యులు కోరారు. కాగా 13న గురువారం గుట్టపై కొలువుదీరిఉన్న పోలేరమ్మ జాతర జరుగుతుందని ఆలయ అర్చకులు విశ్వజ్ఞా ఎస్ఆర్ అనిల్ తెలిపారు.



గుట్టపై సతీసమేతంగ కొలువుదీరిన పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి

ఖిల్లా రామాలయాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

● సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద బ్రహ్మణులు



మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక ఖిల్లా రామాలయాన్ని టూరిజం హబ్‌గా ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతానని రామాలయ విశిష్టతను అపురూప కట్టడాలనిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖలకు వివరించి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని రాష్ట్ర పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. సోమవారం ఖిల్లా డిచ్‌పల్లిలో నిర్వహిస్తున్న చారిత్రాత్మక సీతారాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణానికి రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డితో కలిసి పటేల్ రమేశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాలయంపై స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఖిల్లా డిచ్‌పల్లి రామాలయాన్ని అ భివృద్ధి చేసేలా కృషి చేస్తానని ఆలయానికి జాతీయ రహదారి ప క్కనే ఉండటం, రైల్వే సదుపాయం కూడా ఉందన్నారు. పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేంకు ఆర్కియాలజీ డిపార్టుమెంట్ అధికారులతో ఇటీవలే సంబంధిత అధికారులు ఆలయాన్ని సందర్శించి పర్యాట కులకు కావల్సిన సౌకర్యాలు నివేదించరన్నారు. ఆలయం పక్కన గల చెరువులో బోటింగ్ సదుపాయం, పిల్లల పార్కు, ఏర్పాటు చే సేందుకు చర్యలు తీసుకంటామని బాసరా వెళ్లే భక్తులు ఈ రామా లయం ముందుగా సందర్శించేలా అందుకు అనుగుణంగా ఏర్పా ట్లు చేయిస్తామని తెలిపారు. 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో ఇచ్చిన హామీలను నిలుపుకుందన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఎ న్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని నిజాంసాగర్, శ్రీరాం సాగర్, రూరల్ నియోజకవర్గంలో గుండారం అనంత పద్మనాభస్వామి, రా మడుగు ప్రాజెక్టు సందర్శించే పర్యటకులకు కావల్సిన సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ అపురూప ఖిల్లా రామాలయం సంస్కృతి సంప్ర దాయాలను భవిష్యత్తుతరాలకు తెలియజేసేలా పురాతన ఆలయాలను కాపాడేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. రామాలయంపై కల్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రామాలయం పై ల్యాండ్ స్కేపింగ్, అండ్ గ్రీనరి ఏర్పాటు చేయడంతో పాటు చెరువులో బో టింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రానున్న మార్చి నాటికి రామాలయ అభివృద్ధికి తాను కూడా భాగస్వామ్యం అవుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజానికి ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ ఛైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ ఛైర్మన్ బూస సుదర్శన్, టీపీ సీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతి నిధులు వాసుబాబు, గడ్డం నర్సారెడ్డి, జితేందర్, పోశెట్టి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

మాగాశుద్ధ త్రయోదశి సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీతరామచంద్ర స్వామి కల్యాణం కన్నుల పండుగగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు సుమిత్ శర్మ దేశ్ పాండే ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా దంపతులు అందజేశారు. అనంతరం స్వామి వారికి నిత్యహోమం బలిహరణం, అశ్వసేవ, నివేదన, హారతి మంత్ర పుష్పం కార్యక్ర మాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు భూమయ్య లక్ష్మీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయించారు.

రామాలయం పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ఖిల్లా డిచ్‌పల్లి రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆలయ కమిటీ ఛైర్మన్ శాంతయ్య, సభ్యులు, వీడీసీ కమిటీ భూస సుదర్శన్, నర్సారెడ్డి పర్యాటక అభివృద్ధి ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యుల సూచన మేరకు ఎమ్మెల్యేతో కలిసి పటేల్ రమేశ్‌రెడ్డి చెరువును ఆలయ కట్టడాలను పరిశీలించారు.



విద్యుత్ దీపాలతో ధర్మారం క్యాథలిక్ చర్చ్

నేటి నుంచి లూర్దుమాత ఉత్సవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ధర్మారం క్యాథలిక్ చర్చ్‌లో లూర్దు మాత ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చర్చి నలు వైపులా రంగు రంగుల వి ద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వేడుకలను ఏర్పాట్లను దగ్గ రుండి పర్యవేక్షిస్తున్నారు. క్రైస్తవులకు ప్రార్థనలు చేసేందుకు చర్చిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు చర్చి ప్రతినిధులు వికాస్, సురేశ్, శిలువయ్య, పాల్గొన్నారు.



యేసు క్రీస్తు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అపూర్వం.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● పూర్వ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983-84వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 40 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారికి చదువు నేర్పిన గురువులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించి వారికి పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులైనటువంటి 40 సంవత్సరాల తర్వాత చదువుకొని కలుసుకున్న సందర్భంగా ఒకరినొకరు పరిచయం చేసుకొని వారి జీవితం రీత్యా పరిచయం చేసుకొని మాట్లాడుకోవడం జరిగింది. వారితో చదువు కున్నటువంటి కొంతమంది విద్యార్థులు మృతి చెందడంతో వారికి ఒక్క నిమిషం పాటు మౌనం పాటించి వారికి శాంతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను ఉద్దేశించి మాట్లాడారు. మీరు చెప్పిన విద్యా బోధన ద్వారానే మేము ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్నామని గుర్తు చేశారు. అనంతరం గురువులు మాట్లాడారు అప్పుడు చెప్పినప్పుడు కొంచెం మీకు బాధలా ఉండవచ్చు కానీ పూర్వా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం పాల్గొన్నందుకు మాకు చాలా ఆనందంగా ఉందని అంతేకాకుండా మమ్ములను గుర్తుపెట్టుకుని ముఖ్యఅతిథిగా పిలిచిన విద్యార్థులను అభినందించారు. 40ఏళ్ల తర్వాత కూడా మమ్ములను గుర్తుపెట్టుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈవో వెంకటి, మాజీ ఉపాధ్యాయులు డి.తిరుపతి రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, పి.లింగమూర్తి, ఎల్. రవి, భిక్షపతిరెడ్డి, ఎస్, గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, నారెడ్డి శోభారాణి, మున్నూరు కాపు మండల నేత కాల హనుమాడ్లు, జి. వినోద, ఎస్. విజయ, బలరాం, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున కన్నాపూర్ తండా మూలమలుపు

● చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యో తి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం కన్నాపూర్ తండా మూల మలుపు ప్రమాద రోడ్డుగా మారుతోంది. అతి వేగంగా పెద్ద, చిన్న వాహ నాలను నడపడంతో ఎప్పుడు ఏమీ జరుగుతుందో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సంద ర్శించినా అధికారులు పట్టించుకుని తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన వేల్పూర్ పోలీస్ క్వార్టర్‌ల భవనాలు

● కూలడానికి సిద్ధంగా ఉన్న పోలీస్ క్వార్టర్‌లు

● పట్టించుకోని పాలకులు, అధికారులు





ముళ్లపొదలు, చెట్ల మధ్య అధ్వానంగా మారిన పోలీస్ క్వార్టర్ భవనాలు

వేల్పూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్మించిన పోలీస్ క్వార్టర్‌ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరడం వల్ల ఎప్పుడు కూలిపోతాయేనన్న భయాందోళనతో పోలీసులు ఎవరు కూడా ఆ భవనాల్లో ఉండడంలేదు. దీంతో భవ నాలు పూర్తిగా ముళ్ళ పొదలు, పిచ్చిమొక్కలు, చెట్ల తో నిండిపోయి బూత్ భవనాలుగా మారాయి. అయిన ప్పటికీ పాలకులు, అధికార యంత్రంగం చూసీచూడ నట్టుగా వ్యవహరిస్తున్నారని, విమర్శలు వ్యక్తమవుతున్నా యి. 2002 ఏప్రిల్ 9వ తేదీన అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, ఎస్సై భవనంతో పాటు పోలీస్ క్వర్టర్‌ల భవనా లను ప్రారంభించారు. లక్షలాది రూపాయలతో ఈ భవనాలు అప్పట్లో నిర్మాణం చేపట్టినప్పటికీ భవనాలను పి ల్లర్లతో నిర్మాణం చేపట్టకుండా కేవలం ఇటుకలు, సిమెం ట్‌లతో చేపట్టారు. దశబ్దాల తరబడి ఉండాల్సిన పోలీస్ క్వర్టర్‌ల భవనాలు కొన్నాళ్ళకే శిథిలావస్థకు చేరి కూలడా నికి సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాలు ప్రారంభోత్సవం చేసిన మొదట్లో కొన్ని సంవత్సరాలు పాటు ఆ భవనాలు కుటుంబసభ్యులతో ఉన్నారు. కొన్నేళ్ళకే ఆ భవనాలు శిథిలావస్థకు రావడం, వాటికి మరమ్మతులు చేపట్టక పోవడం వంటి సమస్యలతో పోలీసులు ఎవరు కూడా ఆ భవనంలో ఉండడానికి ఇష్టపడలేదు. దీంతో భవనాల గోడలు బీటలు వారి స్లాబ్ పెచ్చులు ఊడాయి. కిటికీ లు, దర్వాజలు, తలుపులు పూర్తిగా తుప్పుపట్టి పోయి ఊడిపోయాయి. వర్షాకాలంలో గోడలు వర్షపు నీటితో తడిసి ముద్దవుతుంటాయి. బాత్‌రూంలతో పాటు ఫ్లోరింగ్ కుంగిపోయి అధ్వాన స్థితికి చేరింది. అప్పట్లో నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లనే ఈ దుస్థితి చేరిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్మించిన పది పోలీస్ క్వర్టర్ భవనాలు పాములు, పందులు, కుక్కలకు నిలయాలుగా మారాయి. గత్యంతరం లేక కొంత మేరకు బాగున్న ఒకటి రెండు క్వర్టర్ భవనాల్లో మాత్రమే పోలీ సులు అప్పుడప్పుడు సేదా తీర్చుకుంటూ భోజనం చేయ డానికి వాడుకుంటున్నారు. ఒక ఎస్సై భవనం, పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరినప్పటికీ పాలకులు, అధికారులు ఎవరు కూడా పట్టించుకోకపోవడం పట్ల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవచూపి శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్ భవనాలను తొలగించి అదే స్థానంలో పిల్లర్లతో నాణ్యమైన పోలీస్ క్వర్టర్‌ల భవనాలు, ఎస్సై భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు అంటున్నారు.




విరిగిపోయిన గదుల కిటికీలు, తలుపుల దృశ్యం



అధ్వాన స్థితికి చేరిన ఎస్సై భవనం

కనువిందు చేస్తున్న పిట్ట గూళ్లు

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో చెట్లకు అంటుకుని కనిపిస్తున్న పిట్టల సంరక్షణ దృశ్యాలు అందరికీ ఆకట్టుకుంటు న్నాయి. ఎండాకాలం, వర్షా కాలం వ్య వసాయ పొలాల్లో, చెరువులు, వాగుల వద్ద ఇలాంటి దృశ్యాలు ఎక్కువ కనిపిస్తుండగా మండల కేంద్రంలో ఇలాంటివి ఆకట్టుకునే దృశ్యాలు ప్రజలకు కనిపించడం చాలా అదృష్టంగా భావి స్తున్నారు.



రామారెడ్డి మండల కేంద్రంలో కనువిందు చేస్తున్న పిట్టల సంరక్షణ దృశ్యాలు



జిల్లా నాయకులకు సూచనలు ఇస్తున్న షబ్బీర్‌అలీ

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు ప్రతీఒక్కరు కృషిచేయాలి: షబ్బీర్ అలీ

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న నరేందర్‌రెడ్డి గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా ఆయనను కలిసిన నాయకులకు పలు సూచనలుచేశారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను తీసుకువస్తున్న సంస్కరణలు ప్రతీ ఓటరుకు తెలిసేలా చూడడంతోపాటు ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపును భుజాలపై వేసుకుని పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, భీంరెడ్డి, సర్వర్, కిరణ్,మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మగుడి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో గంగమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారుల వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ రజితా వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆలయంలో పూజారుల వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ రజితా వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సామెల్, శ్రీనివాస్‌రెడ్డి, సర్దార్ సింగ్, కిష్టయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా జగదాంబదేవి సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

సదాశివనగర్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచారం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ జగదాంబదేవి సేవాలాల్ మహారాజ్ 36వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.తండా పెద్దలు జాజాల సురేందర్‌కు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు లతారమేష్, నాయకులు బుచ్చయ్య, భాస్కర్, రమేష్, నాగాగౌడ్, రామచంద్రరావు, మహేందర్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

గాంధారి,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారం గ్రామంలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ముదెల్లి సింగిల్‌విండో చైర్మన్ సాయిరాం, అంజయ్య పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు తహసీల్దార్ మహేందర్ తెలిపారు. మండలంలో 2,500 దరఖాస్తులు రాగా, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి కాంప్లెక్స్ పరిధిలో గల సరంపల్లి ఎంపీపీఎస్,చిన్నమల్లారెడ్డి, తిమ్మక్‌పల్లి, లింగయిపల్లి,నర్సన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో ఎల్లయ్య పరిశీలించారు. చదువు పట్ల పిల్లల్లో ఉన్న ఆసక్తిని గమనించడంతో పాటు వారి శక్తిసామర్థ్యాలను పరిశీలించి భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్నభోజనంనుపరిశీలించి నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సీఆర్‌పీ చిరంజీవిలు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యస సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

● వేడుకల్లో పాల్గొన్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గౌండ్ల కులస్తులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిజాంసాగర్ మండలం వెలగనూరు గ్రామంలో సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హనుమాన్ సిండే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌండ్ల కులాలకు కులదైవమైన రేణుక ఎల్లమ్మ విగ్రహాన్ని వెలగనూరు గ్రామానికి చెందిన గౌండ్ల కులస్థులు రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని నిర్మితం చేశారు. సోమవారం ఈ దేవాలయ ప్రారంభోత్సవంతో పాటు రేణుకా ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే మాజీ మాట్లాడుతూ గౌడ కులస్తులకు కులదేవత అయిన రేణుక ఎల్లమనేని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గౌడ కులస్తులు గ్రామ ప్రముఖులు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమాన్ షిండేను శాలువాలతో సన్మానించారు. ఆయనవెంట విండో అధ్యక్షుడు నరసింహారెడ్డి సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, గ్రామ ప్రముఖులు అనిల్‌కుమార్, ఆనంద్‌కుమార్, గౌండ్ల కులస్థుల ప్రముఖులు తదితరులు ఉన్నారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో పుట్టు పంచల కార్యక్రమాల్లో పాల్గొని ఆయన చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు విట్టల్, మాజీఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.



బస్వాపూర్‌లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

భిక్కనూరులో త్రిపుర గవర్నర్

భిక్కనూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బాసర పర్యటనకు వెళ్తున్న త్రిపుర గవర్నర్ సోమవారం భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక హోటల్‌లో టిఫిన్ చేయగా ముందుగా గవర్నర్‌కు హోటల్ వద్ద పలువురు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గవర్నర్ వెంట ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఉన్నారు.

తిప్పాపూర్ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద చిన్నచంద్రం, ఉపాధ్యక్షులుగా తాటిపల్లి మహేందర్, సహాయ కార్యదర్శిగా మంద కుమార్, కోశాధికారిగా మంద రాజు, సహాయ కోశాధికారిగా మంద ప్రవీణ్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

'పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి'

లింగంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు పట్టబద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. అంజిరెడ్డి గెలుపొందితే యువతకు ఉపాధి అవకాశాలు, కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పైడిమారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ క్యాలెండర్‌ను సోమవారం డీఎఫ్‌ఓ నిఖిత, జీజీహెచ్ సూపరిటెండెంట్ ఫరిదా చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్, రాష్ట్రసంయుక్తకార్యదర్శి అరుణ్, జిల్లా ప్రధానకార్యదర్శి అరుణ్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యాక్షులు అంజయ్యమునిర్, ఇక్రమ్, నవీన్,దత్తు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌ను కలిసిన లింగంపేట దళిత నాయకులు

గురుకుల పాఠశాలను లింగంపేటకు తరలించండి

● ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన దళిత సంఘాల నాయకులు

లింగంపేట, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలానికి మంజూరైన ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను కామారెడ్డి నుంచి లింగంపేటకు తరలించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంటయ్యను కామారెడ్డిలో కలిసి లింగంపేట దళిత నాయకులు వినతి పత్రం అందజేశారు. పాఠశాల లింగంపేటకు మంజూరైనా లింగంపేటలో నిర్వహించకపోవడంతో అక్కడి విద్యార్థులకు న్యాయం జరగడం లేదని వారు కమీషన్ చైర్మన్‌ను కోరారు. అధికారులతో మాట్లాడి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు లెగ్గల రాజు, భూపతి, నెల్లూరి గంగారాం, గణేష్ అశోక్, రాజలింగంలతో పాటు నాయకులు ఉన్నారు.

బీజేపీ దోమకొండ మండలాధ్యడిగా భూపాల్‌రెడ్డి

దోమకొండ, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల బీజేపీ నూతన అధ్యక్షునిగా మద్దూరి భూపాల్‌రెడ్డి (దోమకొండ)ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి బీజేపీ మండల అధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు జిల్లా నాయకులు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

బీజేపీ బీబీపేట మండలాధ్యక్షుడిగా ప్రవీణ్ యాదవ్

దోమకొండ (బీబీపేట), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీబీపేట బీజేపీ మండలాధ్యక్షుడిగా అల్లం ప్రవీణ్ యాదవ్ (ఇస్సానగర్) నియామకమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీజేపీ మండల అధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు జిల్లా నాయకులు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి రూ.3లక్షల ఆర్థిక సాయం

మాచారెడ్డి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పల్వంచ మండలం ఇసాయిపేట్ గ్రామంలో నూతన శివాలయానికి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు రూ.3లక్షల ఆర్థిక సాయం చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో మాజీ వైస్ ఎంపీపీ జిడిపల్లి నర్సంహరావు, మాజీ సర్పంచ్ రాజులు ఆలయ ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో ఇసాయిపేట మాజీ ఎంపీటీసీ నారాయణ, మాజీ ఉపసర్పంచ్ నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం రంగంపేట గ్రామంలో గత 20 ఏళ్లుగా అంగన్‌వాడీ స్కూల్‌లో అయాగా పనిచేస్తున్న సాకలి పోశవ్వ చనిపోవడంతో నారెడ్డి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో 26కిలోల సన్నం బియ్యం స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటానని నారెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. నిరుపేదల కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనీఫ్, మహ్మద్ మండల నాయకులు ఠాకూర్, సురేందర్‌సింగ్, పిట్టల అశోక్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలందించాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధినిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని, విధులలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలని ఎస్‌పీ సింధూ శర్మ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణ, రూ రల్ సీఐలతో శిక్షణలో పలు అంశాలపై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తిపరమైన జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని, బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చేవారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణ ఉండాలని తెలిపారు. బందోబస్తు డ్యూటీ ఎలా వేయాలి. ట్రబుల్ మాంగర్లతోటి ప్రజలతో ఏ విధంగా నడుచుకోవాలనే విషయాలపై సీనియర్ అధికారులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు చంద్రశేఖర్, రామన్, తిరుపతయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కానిస్టేబుళ్లకు శిక్షణ ఇస్తున్న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేశామని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు కొత్త సర్వీసు మంజూరులో ఏదైనా దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారులు తగు విధంగా స్పందించడానికి మరొక అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా ఉండేందుకు వినియోగదారునికి దరఖాస్తు చేసుకున్న దానిపై మెస్సేజ్ రూపకంగా ప్రతి ఒక్క దశలో మొబైల్ ఫోన్‌కు వెళ్తుందని తెలిపారు. ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకొని నిర్దిష్టమైన సమయంలో దరఖాస్తులను సమర్పించు కోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారుడు తన దరఖాస్తు స్థితిని తెలుసుకోవడానికి ట్రాకింగ్ చేసే వెసులు బాటు కల్పించామని తెలిపారు. వినియోగదారుడు మరింత సమాచారం కోసం 1912 నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ రగ్బీ క్రీడలకు సిరికొండ విద్యార్థి

సిరికొండ ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) ఈనెలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి రగ్బీ క్రీడలకు సిరికొండ విద్యార్థి చిన్నా ఎంపికయినట్లు పాఠశాల పీ.డీ ప్రశాంత్ తెలిపారు.ఈ నెల 2,3,4 తేదీలలో మంచిర్యాల పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడల పోటీల లో సిరికొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ త రగతి చదువుచున్న చిన్నా క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించినందున జాతీయ స్థాయి క్రీడల పోటీలకు ఎంపికయ్యారని ప్రశాంత్‌తెలి పారు.చిన్నాను సోమవారంపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భోజరాం సన్మానించారు.

'స్థానిక' ఎన్నికలపై పార్టీల గురి!

(5వ పేజీ తరువాయి)

ఒక ఎమ్మెల్యే ఉండడంతో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను సాధించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా గత నెల రోజుల నుంచి బీజేపీ బూత్ స్థాయి మొదలుకుని జిల్లా నూతన కమిటీల ఏర్పాటుపై దృష్టి సారిస్తూ కొత్త నాయకత్వాన్ని నియమించింది. జిల్లావ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు గ్రామ, మండల జిల్లాస్థాయి కమిటీలను ప్రకటించారు. నూతన కమిటీలు స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి పోరాటం చేయడం, కాంగ్రెస్ ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై ఉద్యమం చేస్తున్నాయి. అదేవిధంగా కేంద్రం ప్రవేశపెడుతున్న సంక్షేమపథకాలు అభివృద్ధి పనులు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా వైఫల్యం అవుతున్న దానిపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రధాన పార్టీలు గురిపెట్టాయి.



మహా పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

గాంధారిలో వైభవంగా పడిపూజ

గాంధారి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలోని భోగేశ్వర ఆలయంలో శివస్వాములు పడిపూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు జంగం సంతోస్ అప్ప గణపతి పూజ నిర్వహించి శివ పార్వతుల విగ్రహాలకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని శివస్వాములు పెద్దఎత్తున పాల్గొని అభిషేకాలు చేశారు. అనంతరం గుడిమెట్ పీఠాధిపతి మహదేవ్ స్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు నాగభూషణం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మజీదుల వద్ద సదుపాయాలు కల్పించాలి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని ఆయా మజీద్‌ల వద్ద సదుపాయాలు కల్పించాలని మాజీ కౌన్సిలర్ మహ్మద్ ఇషాకోర్ మున్సిపల్ కమీషనర్ రాజేందర్‌రెడ్డిని కోరారు. సోమవారం అందుకు సంబంధించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జగ్నికిరాత్ పండుగ సందర్భంగా మైనార్టీలు నమాజ్ చేయడానికి వెళ్తారని అందుకు తగ్గట్టుగా విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీరు, ఇతర సదుపాయాలు ఏర్పాటుచేయాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో సోమవారం పీహెచ్‌సీ వైద్యులు వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ఆదర్శ్ 43 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 22 మంది అనారోగ్యంగా ఉన్నట్లు గుర్తించి వారికి మందులను అందించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఏఎన్ఎం జయలక్ష్మీ, ఆశలు లావణ్యరజిత తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై చిరుత సంచారం

లింగంపేట, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచుమల్-సీతాయిపల్లి రహదారిపై సోమవారం రాత్రి చిరుత సంచరించడంతో అటుగా వచ్చిన ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కంచుమల్, కొండాపూర్, ముంబాజీపేట, సీతాయిపల్లి భవానిపేట గ్రామాలప్రజలు, రైతులు అదేరహదారిపై తిరుగుతుంటారు. వాహనదారులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు అటువైపు వెళ్లడానికి భయపడుతున్నారు. అటవిశాఖ అధికారులు స్పందించి చిరుతను బందించి ఇతర ప్రాంతానికి తరలించాలని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



కంచుమల్-సీతాయిపల్లి రహదారిపై సంచరిస్తున్న చిరుత

యూపీఎస్‌పై యుద్ధభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

భిక్కనూరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తెచ్చిన యూపీఎస్ విదానానికి వ్యతిరేకంగా మార్చ్ 2న హైదరాబాద్‌లో చేపట్టనున్న యూపీఎస్ పై యుద్ధబేరి కార్యక్రమ వాల్‌పోస్టర్లను టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం జరుగుతుందన్నారు. ఓపీఎస్ విదానం వచ్చే వరకు తమ ఉద్యమాన్ని ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సభ్యులు మోహన్, సునీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



భిక్కనూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్	- పుష్ప-2
ప్రియా 70	- డాకు మహారాజ్
ప్రియా 35	- మదగదరాజ

బాన్సువాడ

మహేశ్వరి	- సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర	- డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	210

